క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరా బంద్

నిర్మల్‌రూరల్: బంగల్‌పేట్ ఫీడర్ మరమ్మ తుల నేపథ్యంలో శనివారం జిల్లా కేంద్రం లోని పలు కాలనీల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని విద్యుత్‌శాఖ అధికారులు తెలిపారు. జిల్లా కేంద్రంలోని అగ్రికల్చర్ మార్కెట్ ఏరియా, మోచి గల్లీ, బుధవార్‌పేట్, గాంధీచౌక్, కబూతర్ కమాన్, బంగల్‌పేట నాయుడువాడ, బోయవాడ, రామ్‌రావు బాగ్ తదితర ప్రాంతాల్లో ఉదయం 8:30 నుంచి ఉదయం 11 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని పేర్కొన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

అకాల వర్షంతో ఇబ్బందులు



కుంటాలలో ధాన్యం ఆరబెడుతున్న రైతులు

కుంటాల: మండలంలోని ఓలా, అందాకూర్, విఠాపూర్, వెంకూర్, కుంటాల, లింబా(కే), అంబకంటి, సూర్యాపూర్ తదితర గ్రామాల్లో శుక్రవారం తెల్లవారుజామున అకాల వర్షం కురిసింది. కల్లాల వద్ద ఉన్న ధాన్యం తడవడంతో రైతులు ఆరబెట్టారు. వర్షం కురువడంతో రోజంతా ఉక్కపోతతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు.

ప్రారంభమైన ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు

కుంటాల: ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. కుంటాలలోని ఆదర్శ పాఠశాలలో ప్రథమ సంవత్సరం విద్యార్థులకు ఉదయం 9 నుంచి 12 గంటల వరకు తెలుగు, సంస్కృతం పరీక్ష నిర్వహించారు. 150 మంది విద్యార్థులకు గాను 124 మంది హాజరయ్యారు. ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు మధ్యాహ్నం 2:30 నుంచి 5:30 గంటల వరకు నిర్వహించిన తెలుగు, సంస్కృతం పరీక్షకు 37 మంది విద్యార్థులకు గాను 31మంది హాజరైనట్లు చీఫ్ సూపరింటెండెంట్ శ్రీనివాస్ ప్రసాద్, డీవో సంతోష్ తెలిపారు. పరీక్ష కేంద్రం వద్ద 144 సెక్షన్ విధించినట్లు ఎస్సై రజినీకాంత్ పేర్కొన్నారు.

యూనిఫాం క్లాత్ పంపిణీ

లక్ష్మణచాంద: మండల కేంద్రంలోని మండల సమాఖ్య కార్యాలయంలో శుక్రవారం మండలంలోని వివిధ ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు సంబంధించిన యూనిఫాం క్లాత్‌ను మహిళా సంఘాల సభ్యులకు ఎంపీడీవో రాంప్రసాద్ అందజేశారు. పాఠశాలలు ప్రారంభమయ్యేలోగా విద్యార్థులకు దుస్తులు అందించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏపీఎం వాణిశ్రీ, సీసీ సాయన్న తదితరులు ఉన్నారు.

సన్మానం

లక్ష్మణచాంద: జిల్లా కేంద్రంలోని ఆబ్కారీ శాఖ కార్యాలయంలో శుక్రవారం సూపరిటెండెంట్ ఎం.ఏ రజాక్‌ను లక్ష్మణచాంద మండల గౌడ సంఘ సభ్యులు మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా శాలువాతో ఘనంగా సన్మానించారు. ఎక్సైజ్ సీఐ సింధును సన్మానించారు. కార్యక్రమంలో గౌడ సంఘ సభ్యులు వేణుగౌడ్, గంగాధర్‌గౌడ్, రమణగౌడ్, రాజాగౌడ్, రాజేశ్వర్‌గౌడ్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

'విమర్శలు సరికాదు'

ఖానాపూర్: ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఇచ్చిన సోనియాగాంధీని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి విమర్శించడం సరికాదని కాంగ్రెస్ పార్టీ ఎస్టీ విభాగం జిల్లా అధ్యక్షుడు గోవింద్ నాయక్ అన్నారు. శుక్రవారం పట్టణంలో విలేకరులతో మాట్లాడారు. ఇప్పటికైనా బీజేపీ నేతలు చౌకబారు విమర్శలు మానుకోవాలని హితవు పలికారు.

యువకుల రక్తదానం

ఖానాపూర్: పట్టణంలోని శివాజీనగర్ ఎస్సీ కాలనీకి చెందిన బీజేపీ నాయకుడు దాసరి శ్రీనివాస్ తల్లి గంగు అనారోగ్యంతో బాధపడుతోంది. బాధితురాలికి అత్యవసరంగా రక్తం కావడంతో పట్టణంలోని విద్యానగర్‌కు చెందిన కొండా సురేశ్, టి.సంకేత్ ఆసుప్రతికి వెళ్లి రక్తదానం చేసి ఉదారత చాటారు.

రాజీనామా ఆమోదించొద్దని వినతి

ఖానాపూర్: మనస్తాపానికి గురై ఇచ్చిన రాజీనామాను ఉపసంహరించుకుంటున్నానని.. ఆమోదించొద్దని ఆరో వార్డు కౌన్సిలర్ ఆఫ్రీనాబేగం అన్నారు. శుక్రవారం మున్సిపల్ కార్యాలయంలో చైర్మన్ చిన్నం సత్యం సమక్షంలో కమిషనర్ మనోహర్‌ను కలిసి ఈనెల 21న ఇచ్చిన రాజీనామాను ఆమోదించకుండా కౌన్సిలర్‌గా కొనసాగించాలని విన్నవించారు. మున్సిపాలిటీ అభివృద్ధికి చైర్మన్, కౌన్సిల్ సభ్యుల మాటకు కట్టుబడి రాజీనామా ఉపసంహరించుకుంటున్నట్లు పేర్కొన్నారు.

పనులు పరిశీలన

కుంటాల: అమ్మ ఆదర్శ పాఠశాలల్లో కొనసాగుతున్న పనులను గడువులోగా నాణ్యతతో పూర్తి చేయాలని ఎంపీడీవో ఎంఏ రహీం పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని కల్లూర్ కేజీబీవీలో కొనసాగుతున్న పనులను పరిశీలించారు. ఏఈ తుకారాం, పంచాయతీ కార్యదర్శి భోజన్న తదితరులు ఉన్నారు.

కదలరు.. వదలరు

- బాసర ఆలయంలో ఏళ్లుగా తిష్టవేసిన ఉద్యోగులు
- సిబ్బందిపై అవినీతి ఆరోపణలు
- స్థానికులు కావడంతో అన్నింటా పెత్తనం
- పరిపాలనపరంగా అనేక ఇబ్బందులు
- బదిలీ ప్రక్రియను పట్టించుకోని ఉన్నతాధికారులు



సరస్వతీ అమ్మవారు



బాసర సరస్వతీ అమ్మవారి ఆలయం

భైంసా: బాసర సరస్వతీ అమ్మవారి ఆలయంలో పలువురు ఉద్యోగులు ఏళ్లుగా తిష్ట వేసి ఇక్కడే పని చేస్తున్నారు. తమ పలుకుబడి ఉపయోగించుకుంటూ కుర్చీని పట్టుకొనే ఉంటున్నారు. నిబంధనల ప్రకారం మూడేళ్లు పని చేసిన ఉద్యోగిని మరోచోటకు బదిలీ చేయాలని.. కానీ దేవాదాయశాఖ నిబంధనలు పట్టని ఉన్నతాధికారులు బాసర ఆలయ ఉద్యోగుల బదిలీల వ్యవహారం పట్టించుకోవడం లేదు. బాసర ఆలయంలో పని చేసే వారిలో సగానికి పైగా ఉద్యోగులు స్థానికులు కావడంతో వారే పెత్తనం చేలాయిస్తున్నారు. రాజకీయంగా అండదండలతో తిష్ట వేసి తమ పని కానిచ్చేస్తున్నారు. కొంతమంది అధికారులపై అవినీతి ఆరోపణలు ఇటీవల పెరిగిపోయాయి.

దేవాదాయశాఖకు రిపోర్టు...

దేవాదాయశాఖ రాష్ట్రంలోని అన్ని ఆలయాల్లో దీర్ఘ కాలంగా మూడేళ్లకుపైగా పని చేస్తున్న ఉద్యోగులను ట్రాన్స్‌ఫర్ చేయాలని నిర్ణయించింది. ఈ క్రమంలో ప్రతి ఆలయం నుంచి నివేదిక తెప్పించుకున్నారు. ఎన్నికల కోడ్ ముగియగానే బదిలీ చేసేందుకు సిద్ధమవుతున్నారు. బాసర దేవస్థానంలో పలువురు ఉద్యోగులపై కాంగ్రెస్ పార్టీకి చెందిన ఓ కీలక నేత ఫిర్యాదు చేశారు. ఎన్నో ఏళ్ల నుంచి ఇక్కడే పని చేస్తున్నవారితోపాటు అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న ఉద్యోగులను బదిలీ చేయాలని దేవాదాయశాఖ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. బాసర దేవస్థానం అధికారులు గడిచిన రెండు నెలల్లో రెండుసార్లు ఉద్యోగుల రిపోర్టును దేవాదాయశాఖకు సమర్పించారు. అందులో ఇక్కడ పని చేస్తున్న ఉద్యోగుల పూర్తి వివరాలను పొందుపరిచారు.

స్థానికులు కావడంతో మేనేజ్ చేసుకుంటూ..

పదేళ్లపైబడి తిష్టవేసిన ఉద్యోగుల్లో స్థానికులే అధికం. వీరంతా ఇక్కడివారే కావడంతో పరిపాలనపరంగా ఇబ్బందులు కలిగిస్తున్నారని.. ఈ ఉద్యోగులపై పలు ఆరోపణలు ఉన్నాయని బాసర ఆలయ అధికారులే నివేదించారు. ప్రతి విషయంలోనూ జోక్యం చేసుకుంటూ తమకు అనుకూలంగా ఉంటే ఆ సమస్యను బయటకు రాకుండా వ్యతిరేకులైతే ఇబ్బంది పట్టేలా కార్యాచరణ రూపొందిస్తున్నారు. ఈ ఉద్యోగులపై గతంలో పలుమార్లు ఫిర్యాదులు అందాయి. కానీ ప్రతిసారి ఏదో ఒక సాకుతో మేనేజ్ చేసుకుంటూ ఏళ్ల తరబడి తప్పించుకుంటున్నారు. ఏ తప్పు చేసిన తమపై రాకుండా జాగ్రత్త పడుతున్నారు. తమదైన శైలిలో అడుగులువేస్తూ ఆలయ ప్రతిష్టను దిగజారుస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఇటీవల బాసర ఆలయంలో జరిగిన అక్రమాల్లోనూ ఏళ్లుగా తిష్టవేసిన ఉద్యోగుల పాత్ర ఉందని పలువురు చర్చించుకుంటున్నారు.

దశాబ్దాలుగా ఒకే చోట..

తెలంగాణ రాష్ట్రంలోనే బాసర సరస్వతీ ఆలయానికి ప్రత్యేక గుర్తింపు ఉంది. మనరాష్ట్రంతోపాటు పక్క రాష్ట్రాల నుంచి కూడా లక్షలాది మంది భక్తులు ఈ ఆలయానికి వస్తుంటారు. అయినప్పటికీ ఇక్కడ పూర్తిస్థాయిలో సౌకర్యాలు కల్పించడం లేదు. కీలక పోస్టుల్లో పని చేసే అధికారులు భక్తులను పట్టించుకోవడం లేదనే చర్చ కొనసాగుతుంది. దశాబ్దాలుగా ఒకేచోట విధులు నిర్వహిస్తుండడంతో అధికారుల్లో జవాబుదారీతనం లోపించడంతోపాటు అవినీతి, అక్రమాలకు పాల్పడుతున్నట్లు విమర్శలు వస్తున్నాయి.

ఉన్నతాధికారులకు బెదిరింపులు..

దేవస్థాన వ్యవస్థను తమ గుప్పిట్లో పెట్టుకుని అక్రమాలకు తెరలేపుతున్నారని.. కొన్ని సందర్భాల్లో రాజకీయ నాయకుల పేర్లు చెప్పి తమ ఉన్నతాధికారులను బెదిరించిన ఘటనలు ఉన్నాయని సమాచారం. మిగతా ప్రభుత్వశాఖల మాదిరిగానే దేవాదాయశాఖలోనూ ఉద్యోగులకు బదిలీలు ఉంటాయి. కానీ ఏళ్లుగా బాసర ఆలయంలో బదిలీల ప్రక్రియను ఉన్నతాధికారులు పట్టించుకోవడం లేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఏళ్లుగా పని చేసే ఉద్యోగులను బదిలీ చేసి ఆలయ గౌరవం కాపాడాలని భక్తులు కోరుతున్నారు.

నకిలీ విత్తనాలు విక్రయించొద్దు

- వ్యవసాయాధికారులు, ఎస్సైలు
- ఫర్టిలైజర్ దుకాణాల్లో తనిఖీలు
- పలు చోట్ల రైతులకు అవగాహన



లక్ష్మణచాందలో పరిశీలిస్తున్న ఏవో, ఎస్సై శ్రీకాంత్



సారంగపూర్‌లో మాట్లాడుతున్న ఏఓ రాజశేఖర్



సోన్: కూచన్‌పెల్లిలో మాట్లాడుతున్న ఏఈఓ



ఖానాపూర్‌లో తనిఖీ చేస్తున్న అధికారులు



కుంటాలలో మాట్లాడుతున్న ఎస్సై రజనీకాంత్

లక్ష్మణచాంద: నకిలీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్సై శ్రీకాంత్ హెచ్చరించారు. ఎస్పీ జానకి షర్మిల ఆదేశాల మేరకు శుక్రవారం మండలకేంద్రం, పీచర గ్రామాల్లోని ఫర్టిలైజర్ దుకాణాలను ఏవో ప్రవీణ్‌కుమార్‌తో కలిసి తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఎరువులు, విత్తనాలను, రిజిస్టర్లను పరిశీలించారు. లైసెన్సు కలిగిన డీలర్ వద్దనే విత్తనాలు కొనాలని రైతులకు సూచించారు. కొనుగోలుకు సంబంధించి తప్పనిసరిగా రసీదు ఇవ్వాలని నిర్వాహకులను హెచ్చరించారు.

కుంటాల: నకిలీ విత్తనాలు విక్రయిస్తే పీడీయాక్ట్ కేసులు నమోదు చేస్తామని ఎస్సై రజినీకాంత్ హెచ్చరించారు. శుక్రవారం కుంటాల రైతువేదికలో లైసెన్సులు పొందిన ఎరువులు, విత్తన డీలర్ల సమావేశంలో మాట్లాడారు. మహారాష్ట్ర నుంచి విత్తనాలు రాకుండా సరిహద్దు ప్రాంతాల్లో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. ఏవో సోమలింగారెడ్డి మాట్లాడుతూ రైతులకు విత్తనాలు విక్రయించేటప్పుడు తప్పనిసరిగా కంపెనీ పేరు, లాట్ నంబర్ రిజిస్టర్ లో నమోదు చేయాలని కోరారు. రసీదు తప్పనిసరిగా ఇవ్వాలని రైతులకు సూచించారు. ఏఈవోలు శ్రీధర్, గణేశ్, మహేశ్, ప్రగతి, డీలర్లు పాల్గొన్నారు.

సారంగపూర్: రైతులకు నకిలీ విత్తనాలు విక్రయిస్తే చర్యలు తప్పవని మండల వ్యవసాయాధికారి రాజశేఖర్‌రెడ్డి, ఎస్సై చంద్రమోహన్ అన్నారు. మండల కేంద్రంలోని రైతువేదికలో శుక్రవారం ఆయా గ్రామాల ఫర్టిలైజర్ దుకాణాల యజమానులతో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. అధిక ధరలకు విక్రయించినా కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. స్టాక్‌బోర్డులను ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేయడంతోపాటు రిజిస్టర్లు క్రమం తప్పకుండా నమోదు చేయాలని సూచించారు. పీఓఎస్ మిషన్ ద్వారానే ఎరువులు పంపిణీ చేయాలని.. పీఓఎస్ ద్వారా పంపిణీ చేయని డీలర్లపై చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఫర్టిలైజర్ దుకాణాల యజమానులు ఉన్నారు.

సోన్: రైతులు.. లైసెన్సు కలిగిన డీలర్ వద్దనే విత్తనాలు కొనాలని ఏఈవోలు అంబాజీ, అశోక్ అన్నారు. శుక్రవారం మండలంలోని కూచన్‌పెల్లి, మాదాపూర్ గ్రామాల్లో విత్తనాల కొనుగోలుపై ఏర్పాటు చేసిన అవగాహన సదస్సుల్లో మాట్లాడారు. పంట చేతికొచ్చే వరకు రశీదులను భద్రపరుచుకోవాలని సూచించారు. విత్తన ప్యాకెట్‌పై తయారైన తేది, గడువు తేదీ చూసుకోవాలన్నారు. రైతువేదికల్లో జీలుగ విత్తనాలు అందుబాటులో ఉన్నాయని.. ఆసక్తి కల్గినవారు సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు.

రసీదు భద్రపరుచుకోవాలి

పెంబి: ఫర్టిలైజర్ దుకాణాల్లో విత్తనాలు కొన్న రైతులు పంట కాలం ముగిసే వరకు తీసుకున్న రసీదులను భద్రపరుచుకోవాలని మండల వ్యవసాయాధికారి ఆసం రవి పేర్కొన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో ఎస్సై శంకర్‌తో కలిసి పలు ఫర్టిలైజర్ దుకాణాల్లో తనిఖీలు నిర్వహించారు. విత్తనాల గడువు తేది, కంపెనీ వివరాలను పరిశీలించారు. నకిలీ విత్తనాలు అమ్మినట్లు తెలిస్తే దుకాణం లైసెన్స్ రద్దు చేస్తామని హెచ్చరించారు.

ముధోల్: మండలంలోని రైతులకు నకిలీ విత్తనాలు అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటామని వ్యవసాయాధికారి అజ్మీర భాస్కర్ అన్నారు. శుక్రవారం మండలంలోని ఎడ్‌బిడ్ గ్రామంలో విత్తనాల దుకాణం తనిఖీ చేశారు. స్టాక్ రిజిస్టర్, మందుల వివరాలను పరిశీలించారు. రైతులు తప్పనిసరిగా విత్తనాల కొనుగోలు సమయంలో రసీదు తీసుకోవాలని పేర్కొన్నారు.

ఖానాపూర్: పట్టణంలోని ఎరువులు, విత్తనాల దుకాణాలను శుక్రవారం అధికారులు ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఎస్సై లింబాద్రితోపాటు ఏవో ఆసం రవి సంయుక్తంగా దుకాణాలతోపాటు గోదాముల్లోని రికార్డులు, స్టాక్ వివరాలు పరిశీలించారు. నకిలీ విత్తనాలు విక్రయిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఎర్రగుంటలో..

దస్తురాబాద్: నకిలీ విత్తనాలపై అప్రమత్తంగా ఉండాలని వ్యవసాయ విస్తరణాధికారి తిరుపతి రైతులకు సూచించారు. శుక్రవారం మండలంలోని ఎర్రగుంటలో నకిలీ విత్తనాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా రైతులతో మాట్లాడుతూ మార్కెట్‌లో విత్తనాలు కొనేటప్పుడు తప్పనిసరిగా రశీదు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో రైతులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

లేబర్‌కార్డును సద్వినియోగం చేసుకోవాలి



కార్మికులకు కార్డులు అందజేస్తున్న స్వదేశ్

నిర్మల్‌ఖిల్లా: అసంఘటిత రంగంలో పనిచేస్తున్న కార్మికుల సంక్షేమం కోసం ప్రభుత్వ ప్రవేశపెట్టిన లేబర్ కార్డును సద్వినియోగం చేసుకోవాలని ప్రవాసిమిత్ర కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు స్వదేశ్ పర్కిపండ్ల సూచించారు. భవన నిర్మాణ రంగంలో పనిచేస్తున్న పలువురు కార్మికులకు ప్రవాసీమిత్ర కార్మిక సంఘం చొరవతో కార్మిక శాఖ ద్వారా బీవోసీడబ్ల్యూ గుర్తింపు కార్డులను జిల్లా కేంద్రంలోని కార్యాలయంలో శుక్రవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భవన నిర్మాణ తాపీ మేస్త్రీ, సెంట్రింగ్, రాడ్ బెండింగ్, రాళ్ల కొట్టడం, మట్టి, ఇటుక పని, వడ్రంగి, ప్లంబింగ్, ఎలక్ట్రీషియన్ ఇతర కూలీలు కార్మిక బోర్డులో సభ్యత్వం తీసుకుని కార్మిక శాఖ అందించే ప్రయోజనాలు పొందాలని వివరించారు. ఉచిత ప్రమాద బీమా, వివాహ, ప్రసవ సమయాల్లో కార్మిక బోర్డు ద్వారా అందించే నగదు పథకాల ద్వారా ఆర్థిక ప్రయోజనం పొందవచ్చన్నారు. మరిన్ని వివరాలకు ప్రవాసిమిత్ర కార్మిక సంఘం జిల్లా కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు. కార్యాలయ సమన్వయకర్త కొమ్ము గీత, జగదీశ్ ఉన్నారు.

ఆలయాభివృద్ధికి కృషి చేస్తా



ఎమ్మెల్యేను సన్మానిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

ఖానాపూర్: పెద్దమ్మతల్లి ఆలయ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు అన్నారు. శుక్రవారం మండలంలోని సత్తన్‌పల్లిలో పెద్దమ్మతల్లి ఆలయ వార్షికోత్సవాలు కొనసాగుతుండగా ఎమ్మెల్యే హాజరై ప్రత్యేక పూజలు చేశారు. ఈసందర్భంగా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఎమ్మెల్యేను శాలువాతో సన్మానించారు. అనంతరం గ్రామంలోని వరిధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సందర్శించి కొనుగోళ్లు వేగవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో దయానంద్, చిన్నం సత్యం, వెంకాగౌడ్, నిమ్మల రమేశ్, పుప్పాల శంకర్, అంకం రాజేందర్, తోట సత్యం, మాలవత్ రమేశ్‌నాయక్, గుమ్ముల రమేశ్, విజయ్, జక్కుల నర్సయ్య, బీర్నంది రాజన్న, బేర మల్లేశ్ తదితరులు ఉన్నారు.

సేంద్రియ ఎరువు తయారు చేయాలి

- డీపీవో శ్రీనివాస్



గొడిసెరాలో సెగ్రిగేషన్ షెడ్డు పరిశీలిస్తున్న డీపీవో

లోకేశ్వరం: తడి,పొడి చెత్తను వేరు చేసి సెగ్రిగేషన్ షెడ్లలో సేంద్రియ ఎరువు తయారు చేయాలని డీపీవో శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం మండలంలోని వట్టోలి, గొడిసెరా గ్రామాల్లోని నర్సరీ, సెగ్రిగేషన్ షెడ్లను డీపీవో పరిశీలించి మాట్లాడారు. పల్లె ప్రకృతివనంలో పిచ్చి మొక్కలు తొలగించాలన్నారు. నర్సరీలోని మొక్కలకు నీటిని అందిస్తూ కాపాడాలని సూచించారు. పంచాయతీ ల్లో రికార్డులను పరిశీలించాలని సిబ్బందికి సూచించారు. గ్రామాల్లో తాగునీటి సమస్యలు తలెత్తకుండా చూడాలని పేర్కొన్నారు. వారి వెంట ఎంపీడీవో సోలమాన్ రాజ్, కార్యదర్శి గంగాధర్, రాములు ఉన్నారు.

కూలీ డబ్బులు సకాలంలో పంపిణీ చేస్తాం



నగర్‌లో నగదు పంపిణీ చేస్తున్న ఎస్‌పీఎం

లోకేశ్వరం: ఆసరా పింఛన్లు, ఉపాధి కూలీలకు డబ్బులను సకాలంలో పంపిణీ చేస్తామని నర్సాపూర్ (జి) ఎస్‌పీఎం కూన మహేశ్ అన్నారు. మండలంలోని నగర్‌లో ఉపాధి కూలీలు డబ్బుల కోసం గ్రామపంచాయతీ కార్యాలయం ముట్టడించిన విషయం తెలిసిందే. శుక్రవారం ఉపాధి కూలీలకు ఎస్‌పీఎం నగదు పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఎస్‌పీఎం మాట్లాడుతూ పిప్రి పోస్టాఫీసు నుంచి ప్రతి నెలా కూలీలకు డబ్బులు, పింఛన్ల పంపిణీలో జాప్యం జరగకుండా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. గ్రామ కార్యదర్శి విజయ్, బీపీఎం వరుణ్‌రాజ్‌రెడ్డి, ఎఫ్‌ఏ సాయన్న ఉన్నారు.

రైతులకు అందుబాటులో ఎరువులు

ముధోల్: మండలకేంద్రంలోని పీఏసీఎస్ కార్యాలయంలో రైతులకు అందుబాటులో ఎరువులు ఉన్నాయని పీఏసీఎస్ చైర్మన్ వెంకటేశ్‌గౌడ్ ఒక ప్రకటనలో తెలిపారు. డీఏపీ రూ.1350, 20:20:13 రూ.1100, యూరియా రూ.267, ఎస్ఎస్‌పీ సూపర్ రూ .550లు చెల్లించి తీసుకెళ్లాలని పేర్కొన్నారు. మండల కేంద్రంతోపాటు ఆష్ట, బోరిగాం గ్రామాల్లోని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కేంద్రానికి వచ్చే ముందు ఆధార్ జిరాక్స్ తీసుకురావాలని సూచించారు.

నాణ్యమైన విత్తనాలు ఎంచుకోవాలి



రైతులకు విత్తనాలు ఇస్తున్న శాస్త్రవేత్త నర్సయ్య

ముధోల్: వానాకాలం సీజన్ ప్రారంభం కానున్నందున రైతులు నాణ్యమైన విత్తనాలు ఎంపిక చేసుకుని అధిక దిగుబడులు సాధించాలని ముధోల్ వ్యవసాయ పరిశోధన స్థానం శాస్త్రవేత్తలు నర్సయ్య, అధిపతి అన్నారు. మండల కేంద్రంలోని వ్యవసాయ పరిశోధన స్థానంలో శుక్రవారం రైతులకు ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. సోయా, చిక్కుడు, కంది పంటల సాగులో పాటించాల్సిన పద్ధతులను వివరించారు. అనంతరం విత్తనశుద్ధి విధానం చూపి పలు రకాల విత్తనాలు పంపిణీ చేశారు. డీలర్ల వద్దనే రైతులు విత్తనాలు కొని రసీదు భద్రపరుచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు డాక్టర్ కె.విజయ్‌కుమార్, రైతులు సుదర్శన్, ప్రేమ్‌దాస్, గోపిపటేల్ పాల్గొన్నారు.



ఉపాధ్యాయులతో విద్యార్థులు

పూర్వవిద్యార్థుల సమ్మేళనం

ఖానాపూర్: మండలంలోని మస్కాపూర్ జెడ్పీహెచ్‌ఎస్‌లో 2011–12లో పదో తరగతి చదివిన విద్యార్థులు శుక్రవారం గ్రామంలోని సీఎంరావు ఫంక్షన్ హాల్‌లో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈసందర్భంగా పూర్వవిద్యార్థులు ఒకరికొకరు ఆప్యాయంగా పలకరించుకొని యోగక్షేమాలు తెలుసుకున్నారు. అప్పటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను సత్కరించారు. అనంతరం తాము చదివిన పాఠశాలకు వెళ్లి ఉల్లాసంగా గడిపారు.

ఆర్టీసీ బస్సు ఢీ.. వ్యక్తి మృతి

నిర్మల్‌రూరల్: మండలంలోని తల్వేద ఎక్స్‌రోడ్ వద్ద శుక్రవారం రాత్రి ఆర్టీసీ బస్సు, బైక్‌ను ఢీకొట్టిన ఘటనలో ఓ వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. నిర్మల్‌రూరల్ ఎస్సై సాయికుమార్ తెలిపిన వివరాల ప్రకారం..పట్టణంలోని మంజులాపూర్‌కు చెందిన ఎల్లుల్ల పూర్ణచందర్(35) తన సొంత పనులు ముగించుకొని నిర్మల్ వైపు బైక్‌పై వసున్నాడు. నిర్మల్ నుంచి భైంసా వెళ్తున్న ఆర్టీసీ బస్సు మండలంలోని తల్వేద ఎక్స్‌రోడ్ వద్ద బైక్‌ను ఎదురుగా ఢీకొట్టింది. దీంతో పూర్ణచందర్ బైక్ నుంచి కిందపడ్డాడు. తలకు తీవ్ర గాయాలవడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య, కూతురు, కుమారుడు ఉన్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వివరించారు.

నిర్లక్ష్యంతోనే రోడ్డు ప్రమాదాలు

నర్సాపూర్(జి): మద్యం, తాగి నిర్లక్ష్యంగా వాహనాలు నడపడంతోనే రోడ్డు ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని ఎస్సై హన్మాండ్లు పేర్కొన్నారు. మండలకేంద్రంలోని పోలీస్‌స్టేషన్ ఆవరణలో శుక్రవారం ఆటోడ్రైవర్లకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు. వాహన పత్రాలు, డ్రైవింగ్ లైసెన్స్ వెంట ఉంచుకోవాలని సూచించారు. అనంతరం ఆటో డ్రైవర్లతో ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తామని ప్రతిజ్ఞ చేయించారు.

ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో జాన్సన్‌నాయక్



మాజీ మంత్రిని సన్మానిస్తున్న జాన్సన్‌నాయక్

ఖానాపూర్: వరంగల్–ఖమ్మం–నల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో భాగంగా శుక్రవారం మహబూబాబాద్‌లో బీఆర్‌ఎస్ నియోజకవర్గ ఎమ్మెల్సీ జాన్సన్‌నాయక్, స్థానిక నాయకులు పర్యటించారు. ఎమ్మెల్సీ అభ్యర్థి ఏనుగుల రాకేశ్ రెడ్డి గెలుపే లక్ష్యంగా పార్టీ శ్రేణులు పనిచేయాలని కోరారు. ఈసందర్భంగా ప్రచారంలో మాజీ మంత్రి సత్యవతి రాథోడ్‌ను కలిసి శాలువాతో సన్మానించారు. అనంతరం జాన్సన్‌నాయక్‌ను మాజీ ఎమ్మెల్యే శంకర్‌నాయక్ సన్మానించారు. కార్యక్రమంలో కొక్కుల ప్రదీప్, తిరుపతిరెడ్డి, అడిదెల మహేందర్, కొక్కుల శేఖర్, తోట సుమిత్ తదితరులు ఉన్నారు.

జీలుగ విత్తనాలు పంపిణీ



విత్తనాలు అందిస్తున్న ఏవో ప్రవీణ్‌కుమార్

లక్ష్మణచాంద: మండల కేంద్రంలోని పీఏసీఎస్ కార్యాలయంలో శుక్రవారం జీలుగ విత్తనాల పంపిణీ కార్యక్రమాన్ని ఏవో ప్రవీణ్‌కుమార్ ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ 30 కేజీల జీలుగ విత్తనాల బస్తా సబ్సిడీపై రూ.1,116 అందిస్తున్నామని పేర్కొన్నారు. కావాల్సిన రైతులు పట్టాదార్ పాస్‌పుస్తకం, ఆధార్ జిరాక్స్‌లతో కార్యాలయంలో సంప్రదించాలని కోరారు. ఇందులో పీఏసీఎస్ సీఈవో ఉదయ్, సిబ్బంది సాయికుమార్ తదితరులు ఉన్నారు.